క్లుప్తంగా

పేదరిక నిర్మూలనే లక్ష్యం



మండల అధికారులతో సమావేశమైన నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రమీలా గాంధీ

దత్తిరాజేరు: పేదరిక నిర్మూలన, తలసరి ఆదాయం పెంపే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రమీలా గాంధీ అన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికపై మండల అధికారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు ఆదాయ మార్గాలను చూపించగలిగితే తలసరి ఆదాయం పెరుగుతుందని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన వనశాఖ, ఫిషరీష్, వెలుగు తదితర శాఖల ద్వారా ప్రతీ కుటుంబానికి ఆదాయ మార్గాలను చూపించాలన్నారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



బాలింతకు బాలామృతం ప్యాకెట్ అందజేస్తున్న పీడీ రుక్సానా సుల్తానా బేగమ్

గంట్యాడ: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగమ్ అన్నారు. నరవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అక్కడి అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడుతూ కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, కాన్వెంట్లకు ధీటుగా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలని సూచించారు. బాలింతలకు బాలామృతం ప్యాకెట్లు అందజేశారు. అనంతరం జగ్గాపురం గ్రామంలో కిశోరి బాలికలకు నిర్వహించిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను పరిశీలించారు. కిశోరి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, భద్రత, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ లైన్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి, సూపర్ వైజర్ సుభాషిణి, డీసీపీఓ లక్ష్మి ఉన్నారు.

స్టాపర్ల వితరణ



సీఐ షణ్ముకరావుకు స్టాపర్లను అందజేస్తున్న గురుదేవా ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస: రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు సాయంగా మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం పది స్టాపర్లను వితరణ చేసింది. స్టాపర్లను స్థానిక సీఐ షణ్ముకరావుకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు శనివారం అందజేశారు. వీటిని మండల పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం,అరకు రోడ్లలో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో పెడతామని సీఐ చెప్పారు. ఆస్పత్రి యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కానిస్టేబల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం పొందడం పౌరుడి హక్కు



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ వాణిశ్రీ

దత్తిరాజేరు: ప్రభుత్వ కార్యాలయాల నుంచి తమకు కావాల్సిన సమాచారం పొందడం పౌరుడి హక్కు అని ఈఓపీఆర్డీ వాణిశ్రీ అన్నారు. రామచంద్రాపురం,శికారుగంజి, పాచలవలస గ్రామాల్లో ప్రజలకు సమాచార హక్కుచట్టంపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న, గతంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారంతో పాటు భూములు, భవనా లకు సంబంధించిన ఏ సమాచారమైనా తెలుసుకోవచ్చని అన్నారు. మండల పర్యవేక్షకులు శివాజీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు శివ

విజయనగరం: ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు నగరంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.శివ అర్హత సాధించాడు. ఈ నెల 4 నుంచి 6 వరకు బిహార్ రాష్ట్రంలోని గయాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు శివ ప్రాతినిధ్యం వహించనున్నాడు. నగరంలోని కస్పా స్కూల్ పీడీ కె.గోపాల్ వద్ద ఈ విద్యార్థి శిక్షణ పొందుతున్నాడు. విద్యార్థిని కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెనుమజ్జ విజయలక్ష్మి, సత్యనారాయణ, చైర్మన్ చిన్నం నాయుడు అభినందించారు.

ఇదేం..చెత్త నిర్వహణ

- గ్రామాల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న ఎస్‌డబ్ల్యూపీసీలు
- ఎస్‌డబ్ల్యూపీసీలకు చేరని చెత్త
- చేరిన చోట తయారు కాని వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు
- కేంద్రాలతో పాటు గ్రామాల్లో రోడ్లపై, ఎక్కడిపడితే అక్కడ గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త
- ప్రతీ నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అంటూ హడావుడి చేస్తున్న అధికారులు



ఎల్.కోట మండలంలోని గేదులవానిపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం

కొత్తవలస: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణ అధ్వానంగా తయారైంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయే తప్ప లక్ష్యాలను చేరుకోవడం లేదు. కేంద్రాల్లో చెత్త నుంచి సంపద తయారీ విషయం పక్కన పెడితే...కొన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసి డర్లు చెత్తను కేంద్రాలకు తరలించడమే లేదని ప్రజలు అంటున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలోని ఎల్.కోట, ఎస్.కోట, జామి, వేపాడ, కొత్తవలస మండలాల్లో 137 పంచాయ తీలు ఉండగా... 122 పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను నిర్మించారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు వీధుల్లో పేరు కుపోయిన చెత్తను రిక్షాల ద్వారా ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేర్వేరుగా కుండీల్లో వేసి వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేంద్రా ల ఏర్పాటు వెనుక లక్ష్యం. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లక్ష్యం నీరుగారుతోంది. చాలా వరకు ఎస్‌డబ్ల్యూపీసీలు అలంకార ప్రాయంగా మిగిలాయి.

ఎస్.కోట నియోజకవర్గంలో ఎస్‌డబ్ల్యూపీసీలు		
మండలం	పంచాయతీలు	ఎస్‌డబ్ల్యూపీసీలు
ఎస్.కోట	26	22
ఎల్.కోట	31	29
వేపాడ	29	25
కొత్తవలస	25	24
జామి	25	21

కొన్ని గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించకుండానే మార్గం మధ్యలో రోడ్లకు ఇరువైపులా, వీధుల శివారులో డంప్ చేసేస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించాలిస్సన అధికారులు అది తమ పని కాదే...అన్నట్లు వ్యవహరిస్తున్నారని, అసలు పట్టించుకోవడం లేదని, కానీ ప్రతీ నెలా మూడో శనివారం మాత్రం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర అంటూ రోడ్లు ఊడ్చుతూ, కార్యాలయాల్లో పరిశుభ్రత పనులు చేస్తూ , ర్యాలీలు, ప్రతిజ్ఞలతో హడావుడి చేస్తున్నారనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.



కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెంలో ఎస్‌డబ్ల్యూపీసీలో ఖాళీగా ఉన్న కుండీలు



ఎల్.కోట మండలంలోని ఖాసాపేట గ్రామంలో రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త



ఎల్.కోట మండలంలోని మల్లివీడులో తుప్పల మధ్యలో నిర్వహణకు దూరంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ

పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన



స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను డీఈఓ మాణిక్యంనాయుడు శనివారం పరిశీలించారు. అన్ని తరగతుల విద్యార్థులకు సరిపడా పుస్తకాలు వచ్చింది లేనిది, ఏయే పుస్తకాలు రాలేదో ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్‌ను ఆరా తీశారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 3,523 మంది విద్యార్థులు ఉంటారని, వారందరికీ రెండు మూడు టైటిల్స్ తప్ప మిగిలిన పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓలు చెప్పారు.రెండు మూడు రోజుల్లో మిగతా పుస్తకాలు రానున్నాయని ఎంఈఓలు చెప్పడంతో డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ వెంట డిప్యూటీ డీఈఓ కె.మోహన్‌రావు, ఎడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డి నేటర్ ఏ.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

బొండపల్లి: గ్రామ సచివాలయాల్లో ఈనెల 5వ తేదీ నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.తులసీనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 8 వ తేదీ వరకు మండల కేంద్రంలోని సచివాలయంలో, 12,13వ తేదీల్లో బి.రాజేరు సచివాలయంలో,14,15వ తేదీల్లో కొండకిండాం సచివాలయంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ కార్డు కావాల్సిన వారు, కార్డుల్లో మార్పులు,చేర్పులు చేయాలనుకునే వారు, ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ కార్డు చేయించుకోవాలనుకునేవారు ఈ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ఆంగ్లంపై పట్టుసాధించాలి



అవగాహన కల్పిస్తున్న సీఈఈ వ్యవస్థాపకులు రామకృష్ణ

శృంగవరపుకోట: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని సెంట ర్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్‌మెంట్(సీఈఈ) వ్యవస్థాపకులు బి.రామకృష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ భాషకైనా పదాలే సంపదని, పదాలపై పట్టు సాధిస్తే భాషపై పట్టు వస్తుందని అన్నారు. భాష ఏదైనా పదాలు ఎంత ఎక్కువ నేర్చు కుంటే అంత మంచిదని, నేర్చుకున్న ప్రతి పదానికి అర్థం తెలుసుకోవడం, వాటిని సందర్భోచితంగా ప్రయోగించడం ముఖ్యమని వివరించారు.లైబ్రేరియన్ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సమ్మర్ షటిల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ షటిల్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షటిల్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు. శిబిరం నిర్వహణకు రూ.2.20లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. స్థానికులు, స్నేహితులు, క్రీడా ఔత్సాహికుల సహకారంతో 19 ఏళ్లుగా క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న శిబిరంలో ఇప్పటికి 70 మంది విద్యార్థులు చేరారని, మరో 80మంది చేరే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులకు ఉదయం పాలు, గుడ్లు, సాయంత్రం గ్లూకోజ్, నిమ్మరసం ఇస్తామని, ఇంటర్నల్ మ్యాచ్‌ల నిర్వహణ, క్రీడాదుస్తుల పంపిణీ చేస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీ సుధారాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఎఫ్ఆర్‌సీ అధ్యక్షుడు డాక్టర్ సత్యశేఖర్, ఎస్.ఎస్. వెంకటరావు, మంధా సుబ్బారావు, షేక్ ఖాధర్, మళ్ల రామకృష్ణ, మళ్ల వేణు, అంబటి స్వామినాయుడు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే..



శృంగవరపుకోట: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి



గజపతినగరం: మాట్లాడుతున్న జడ్జి విజయ్‌రాజ్ కుమార్

శృంగవరపుకోట: ఆర్టికల్ 39(డి) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశ కార్మికచట్టం హామీ ఇస్తోందని ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు అధ్యక్షతన అసంఘటిత రంగ కార్మికులకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి కనకలక్ష్మి మాట్లాడుతూ కార్మిక చట్టం ఉద్దేశం సాధికారతను ప్రోత్సహించడం, ఉపాధి పనుల్లో సమాన భాగస్వాములుగా వారి హక్కులను కాపాడడమే అన్నారు. పని పరిస్థితులు, వేతనాలు, ఆరోగ్యం, భద్రతా ప్రమాణా లు చట్టంలో ఉద్దేశించబడ్డాయని చెప్పారు. అసంఘటిత కార్మికులు, మహిళలకు ఏమైనా న్యాయసహాయం కావాలంటే కోర్టు ప్రత్యేకంగా న్యాయవాదిని ఏర్పా టు చేస్తుందని చెప్పారు. మండల కార్మిక సంస్థ అధికారిని రప్పించి అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియ చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కార్మికులు హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం: అసంఘటిత రంగ కార్మికులంతా కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆటో కార్మికులకు కార్మిక చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ, ఇతర కార్మికులు అంతా కార్మిక సంక్షేమ బోర్డు అందించే పథకాల గురించి తెలుసుకుని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టిందని, దానిని ప్రతీ ఒక్కరు తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్టర్ కావాలని సూచించారు. ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని, ఇతర ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.

నవధాన్యాలతో భూసారం



నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని విజయనగరం రైతు శిక్షణా కేంద్రం ఏఓ గోవిందమ్మ అన్నారు. నవ ధాన్యాలను సాగు చేయాల్సిన అవశ్యకత, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై దత్తిరాజేరు మండలంలోని వింధ్యవాసి గ్రామ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో వరితో పాటు ఇతర ప్రధాన పంటలు వేయాలనుకునే పొలాల్లో వేసవి దుక్కులు చేసి జీలుగు, కట్టె జనుము, మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాలు తదితర విత్తనాలను చల్లాలని సూచించారు. నవధాన్యాల పంటల చేను ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నాలని వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఏఓ అనురాధ, తదితరులు పాల్గొన్నారు. – దత్తిరాజేరు

సత్యసాయిబాబా రథం ఊరేగింపు



నవంబర్‌లో భగవాన్ సత్యసాయిబాబా జయంతోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో సత్యసాయి సేవా మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రథం ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎల్.కోట మండల కేంద్రంలో శనివారం సత్యసాయి బాబారథం ఊరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన సత్యసాయి మహిళా భక్తులు రథానికి పూర్ణ కుంభాలతో స్వాగతం పలికి ఊరేగింపులో పాల్గొన్నారు. సత్యసాయి సేవా మండలి సభ్యులు సత్య సాయిబాబా జీవిత విశేషాలను వివరించారు. ఈ రథం జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి, నవంబర్ 23వ తేదీ నాటికి పుట్టపర్తి చేరుకుంటుందని తెలిపారు. – లక్కవరపుకోట

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వేసవి సెలవుల్లో బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధతో విద్యార్థులకు శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. సెలవుల్లో విద్యార్థులు మొబైల్స్, టీవీ, సినిమాలు అంటూ సమయాన్ని వృథా చేసుకోకుండా ఇలాంటి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకుడు గద్దే అనురాగ్, వార్డెన్ మంగళగిరి శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు స్వరూప్, మురళి, వేణు పాల్గొన్నారు. – చీపురుపల్లి

సమరసత సేవా ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం



సమరసత సేవా ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

లక్కవరపుకోట: స్థానిక జగనాథస్వామి ఆలయంలో సమరసత సేవాఫౌండేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఖండ సంయోజక్ కొరుపోలు అప్పారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పల్లెల్లో ఆధ్యాత్మికత, ప్రజల్లో భక్తి భావన పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలతో ముద్రించిన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. మే నెలలో నిర్వహించనున్న కార్యక్రమాలపై సభ్యులతో చర్చించారు. ఖండ సహ సంయోజక్ ద్వారపూడి సత్యారావు, కార్యవర్గ సభ్యులు మోటూరు గోవిందరావు, కోళ్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు



మాట్లాడుతున్న జిల్లా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు పొంచి ఉందని, కార్మికులకునష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు బెహరా శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు, ఎనిమిది గంటల పని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు మే 20 తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఏఐఎఫ్‌టీయు నాయకులు బెహరా శంకరరావు అధ్యక్షతన ఎల్బీజీ భవన్‌లో శనివారం నిర్వహించారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం 10 గంటలకు ఎన్‌పీఆర్ శ్రామిక భవన్, కె.ఎల్ పురం, సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహిస్తామని చెప్పారు. స్వతంత్ర ఫెడరేషన్లు,ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయ కులు, సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి వి.రాములు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.అప్పలసూరి పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

నెల్లిమర్ల రూరల్: తారకరామతీర్ధ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల భూసమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల నేత కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని కోరాడపేటలో నిర్వాసితులను శనివారం ఆయన కలిసి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతుల భూములను ప్రభుత్వ భూమిగా సిబ్బంది నమోదు చేశారని, ఆ భూమిని బాధిత రైతులకు అప్పగించిన తర్వాతే పనులు ప్రారంభించాలన్నారు. కోరాడపేట, ఏటీ అగ్రహారం నిర్వాసితులకు ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదని, నెల్లిమర్ల పట్టణంలో వారికి కేటాయించిన నివాస స్థలాలను తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



కోరాడపేటలో నిర్వాసిత రైతులతో సీపీఎం నేత రామారావు